ప్రతిపాదనల్లో ఉత్సాహం.. పనుల్లో తాత్సారం

- నత్తనడకన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలు
- నిధుల మంజూరులో జాప్యం
- అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని వినతి



తెల్లరాళ్లపల్లితండాలో నిర్మాణం పూర్తయిన జీపీ భవనం



నిర్మాణంలో బుసిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ భవనం

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల్లో పంచాయతీ భవన నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో నేటికీ పనులు ప్రారంభించలేదు. దీంతో అద్దె గదులు, పాఠశాల భవనాలల్లో అసౌకర్యాల నడుమ పంచాయతీ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ సరైన వసతులు లేకపోవడంతో నిర్వహణకు అంతరాయం ఏర్పడి పంచాయతీ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. మంజూరైన భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలో శిథిలావస్థకు చేరుకున్న గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణాల కోసం ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కొక్క పంచాయతీకి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరైన నిర్మాణాలు ముందుకు సాగడంలేదు. దీంతో శిథిలావస్థకు చేరుకున్న పంచాయతీ భవనాల్లో సమావేశాలు నిర్వహించాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని పంచాయతీ గ్రామస్తులు చెందుతున్నారు. మంజూరైన పంచాయతీ భవనాల్లో రెండు పంచాయతీల నిర్మాణాలు ప్రారంభించినా.. మిగిలిన పది పంచాయతీ భవనాల నిర్మాణాల్లో కేవలం బుసిరెడ్డిపల్లి మినహా మిగిలిన వాటిలో ఏ ఒక్కటి నిర్మాణం పనులను ప్రారంభించలేదు.

మండలంలో పరిస్థితి ఇదీ

మండలంలో అన్నారంతండా, బహదూర్‌గూడెం, బుసిరెడ్డిపల్లి, చిక్కేపల్లి, దొండాయిపల్లి, గోప్లాపూర్, కిష్టాపూర్‌తండా, మాందాపూర్, రేమద్దుల, శాగాపూర్‌తండా, తెల్లరాళ్లపల్లితండా, వెంగళాయిపల్లి పంచాయతీ భవనాల నిర్మాణాలకు రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. వాటిలో తెల్లరాళ్లపల్లితండా, దొండాయిపల్లి గ్రామాల్లో మాత్రమే భవన నిర్మాణాలు పూర్తి చేశారు. బుసిరెడ్డిపల్లిలో నిర్మాణం పనులు జరుగుతున్నాయి. మిగిలిన వాటిలో స్థలాల ఇబ్బందుల పేరుతో నిర్మాణం ఇంకా పనులను ప్రారంభించలేదు.

అందని బిల్లు



ఉపాధి హామీ పథకం ద్వారా నూతన పంచాయతీ భవన నిర్మాణానికి అప్పులు చేసి పనులు చేపట్టినా.. నేటికీ బిల్లు మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. తెచ్చిన అప్పులకు వడ్డీ చెల్లించడం ఇబ్బందిగా మారింది. రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మాణాలు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా నేటికీ నిధులు మంజూరు కాక చేసిన అప్పులు పెరుగుతున్నాయి.

– శాంతమ్మ, మాజీ సర్పంచ్, తెల్లరాళ్లపల్లితండా

స్థలాల ఎంపిక పూర్తి చేయాలి



మండలంలో జీపీ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరైనా.. స్థలాల ఎంపికలో ఆలస్యంతో నిర్మాణాలలో జాప్యం జరుగుతుంది. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని స్థలాలను ఎంపిక చేసిన భవన నిర్మాణాలను ప్రారంభించాలి. నూతన జీపీలు పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలు, అద్దె భవనాల్లో కొనసాగుతుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని స్థలాలను ఎంపిక చేసిన నిర్మాణాలను ప్రారంభించాలి.

– సూర్యవంశ రాము, సీఐటీయూ నాయకుడు, బుసిరెడ్డిపల్లి

ఉన్నతాధికారులకు నివేదించాం

స్థలాల ఎంపికలో జాప్యంతో నూతన పంచాయతీ నిర్మాణాలు ఆలస్యం అవుతున్నాయి. మండలంలో 12 పంచాయతీల్లో రెండింటి నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన వాటిలో బుసిరెడ్డిపల్లిలో పనులు కొనసాగుతున్నాయి. నిర్మాణాలు పూర్తైన వాటికి నిధులు విడుదల అయితే కాంట్రాక్టర్ల ఖాతాల్లో జమ చేస్తాం. ఈ విషయాన్ని మరోమారు జిల్లా అధికారులకు నివేదిస్తాం.

– రమణ, పీఆర్ ఏఈ, పాన్‌గల్

అంటువ్యాధులతో జాగ్రత్త



వీపనగండ్ల: గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలను చైతన్యపర్చడంలో వైద్య సిబ్బంది కీలక పాత్ర పోషించాలని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డా.వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కాలానుగుణంగా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు, పైలేరియా, పసిరికలు, వాంతులు, విరోచనాలు తదితర వ్యాధులు కలుషిత నీరు, అపరిశుభ్ర పరిసరాల వల్ల సంభవిస్తాయన్నారు. ఇలాంటి వాటిని ముందస్తుగా గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయించడం, నీటి పైపు లైన్ల లీకేజీలను సరి చేయించడం, మురికి గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా ఉండడం లాంటి చర్యలు తీసుకోవడం వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలను సీజనల్ వ్యాధుల బారిన పడకుండ కాపాడవచ్చని ఆయన అన్నారు. నెలవారి నివేదికలు తయారు చేయడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించరాదని హెచ్చరించారు. వైద్య సిబ్బంది నిరంతరం గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

క్లుప్తంగా

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



వనపర్తి టౌన్: చింతల ఆంజనేయస్వామి శోభాయాత్ర, విగ్రహమూర్తి పల్లకీ సేవా ఉత్సవాలను మంగళవారం రాత్రి చింతల ఆంజనేయ మాలధారణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. మాలధారణలో భాగంగా చివరి మంగళవారం కావడంతో చింతల హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలను తిలకించేందుకు వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేస్తూ రాత్రి 10:30 వరకు స్వామివారి శోభాయాత్రను కొనసాగించారు. ఉత్సవ ఊరేగింపులో భాగంగా గాంధీ చౌక్, కమాన్ చౌరస్తా, శంకర్ గంజ్, రాజీవ్ చౌక్, బస్ డిపో రోడ్డు, బస్టాండ్, ఆర్డీఓ కార్యాలయం, తదితర ప్రాంతాల గుండ రామాలయం వరకు ఈ కార్యక్రమం చేపట్టారు. చింతల ఆంజనేయ మాలధారణ సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ.. ప్రతి రోజు ప్రజలు కొంత సమయాన్ని దైవ భక్తికి కేటాయించాలని అభ్యర్థించారు.

ఆంజనేయస్వామికి పడిపూజ



మదనాపురం: మండలంలోని దుప్పల్లి ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆంజనేయ మాలధారులు బుధవారం ఆంజనేయ స్వామి పడిపూజ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. మాలధారణ చేసిన భక్తులు బంధువులు, కుటుంబ సభ్యులు ఈ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు స్వామివారికి ఆకుల పూజ, నైవేద్యం సమర్పించారు. అనతంరం హోమం, పడి పూజ చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

ఉపాధి పనుల పరిశీలన



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని శేరుపల్లిలో మంగళవారం ఉపాధి హామీలో ఊర చెరువులో పూడికతీత పనులను ఎంపీడీఓ రవీంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 276 మంది ఉపాధి పనులకు హాజరయ్యారని, వీరందరికి కొలతల ప్రకారం పని చేసినచో రూ.300 కూలి వస్తుందని వారికి వివరించారు. రహదారి వెంబడి మొక్కలకు రోజు నీరందించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, ఈసీ సుజిత్‌కుమార్, టీఏ సురేందర్‌రెడ్డి, ఎఫ్‌ఏ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు



ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో పశువులకు టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతోంది. మంగళవారం మండలంలోని రేవులపల్లి, ఖమ్మంపాడు, గుడ్డెందొడ్డి, గ్రామాల్లో మండల పశువైద్యాధికారి డాక్టర్ శంకరయ్య ఆధ్వర్యంలో పశువులకు జబ్బువాపు, చిటుకు రోగం, గొంతు వాపు నివారణ టీకాలు వేశారు.

గ్రామపంచాయతీ రికార్డుల పరిశీలన

మానవపాడు: మండలంలోని అమరవాయి గ్రామ పంచాయతీ రికార్డులను, ఉపాధిహామీ పనులకు సంబంధించిన రికార్డులను మంగళవారం ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధిహామీకి సంబంధించిన కూలీలు రూ.300 కూలీ పడేలా కొలతలను నిర్వహించాలని సూచించారు. ఉదయం 7గంటల సమయానికి ఉపాధి పనికి వెళ్లాలని, క్షేత్రస్థాయిలో నిర్ధేశించిన పనిని పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తే చర్యలు

పెద్దకొత్తపల్లి: సారా విక్రయిస్తూ పట్టుబడితే రూ.50 వేల జరిమానాతో పాటు 6 నెలల జైలు శిక్ష ఉంటుందని తహసీల్దార్ ఈసూఫ్‌అలీ అన్నారు. మండల కేంద్రానికి పసుపుల పృథ్వీరాజు 4 లీటర్ల సారా, దేవల్ తిరుమలాపూర్ గ్రామానికి చెందిన బెల్లె ఈశ్వరమ్మ 6 లీటర్ల సారా విక్రయిస్తుండగా ఎక్సైజ్ అధికారులు వారిని పట్టుకొని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ వెంకటమ్మ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సవారమ్మ జాతర



సవారమ్మ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



ఆలయం వద్ద భక్తుల సందడి

అమరచింత: పట్టణ శివారులో వెలసిన సవరమ్మ దేవత జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జాతర ఉత్సవాల్లో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పట్టణంలోని భక్తులు మంగళవారం తెల్లవారుజాము నుంచి ఆలయానికి వచ్చి అమ్మవారికి నైవేద్యాలతో పాటు కోళ్లు, టెంకాయలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఏడాది వేసవి చివరిలో సవరమ్మ దేవత జాతరను నిర్వహించడం అనవాయితీ అని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వెంట టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, శ్రీలన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలపై పోరాటం



మత్స్యకారుల సంఘం నూతన కార్యవర్గం

ఖిల్లాఘనపురం: మండలంలోని మానాజీపేట గ్రామ మత్స్యకారుల సహకార సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి కొండన్న ఆధ్వర్యంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని నూతన అధ్యక్షుడు ఉప్పరిపల్లి చెన్నయ్య తెలిపారు. గ్రామంలోని సంఘం భవనం వద్ద ఎన్నికల అధికారి సూచనల మేరకు సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అధ్యక్షుడిగా ఉప్పరిపల్లి చెన్నయ్య, ఉపాధ్యక్షుడిగా చెన్న వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శిగా పి.శేషయ్య, సంఘం డైరెక్టర్లుగా గోనెల రాములు, టి.బాలయ్య, కొరిగెల శ్రీను, టి.శేఖర్, చెన్న పర్వతాలు, జాగల వెంకటయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి కొండన్న ఆధ్వర్యంలో ఎన్నికలు నిబంధనల ప్రకారం నిర్వహించినట్లు తెలిపారు.

పెంట్లవెల్లి: నాగర్‌కర్నూల్ జిల్లాలోని అన్ని గ్రామాల్లో మత్స్య సహకార సంఘాలను అభివృద్ధి చేసుకుందామని జిల్లా అధ్యక్షుడు అంజి, మండల అధ్యక్షుడు డబ్బ గోవిందులు అన్నారు. మంగళవారం మంచాలకట్టలో మత్స్యకారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి ఒక్క మత్స్యకారుడు సభ్యత్వం పొందాలన్నారు. రానున్న రోజుల్లో ప్రతి మత్స్యకారుడికి గుర్తింపు కార్డులు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేద మత్స్యకారుడికి న్యాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమకు రాజకీయాల్లో తగిన ప్రాధాన్యం కల్పించాలన్నారు. ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. వెంకటనరింహ, కురుమయ్య, నర్సింహ, రాముడు, వెంకట్, నారాయణ, కురుమన్న, సాయప్ప, చెంగలప్ప తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలను ప్రజలు విశ్వసించరు

వీపనగండ్ల: లక్ష్మీపల్లి గ్రామంలో జరిగిన హత్యతో మంత్రి జూపల్లికి సంబంధం ఉందని ప్రతిపక్ష పార్టీల నాయకులు చేస్తున్న ఆరోపణలను ప్రజలు విశ్వసించరని జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు డా.ఇంద్రకంటి వెంకటేష్ అన్నారు. మంగళవారం సంగినేనిపల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 25 ఏళ్లుగా ప్రజా సేవకే అంకితమై పలుమార్లు ఎమ్మెల్యే, మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న కృష్ణారావుపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని ఆయన అన్నారు. ప్రజాక్షేత్రంలో ఓడిపోయి అబండాలు వేసి తమ ప్రతిష్టను పెంచుకోవాలని చూస్తే ప్రజలే అలాంటి వారికి తగిన గుణపాఠం నేర్పుతారని మండిపడ్డారు.

శ్రీధర్‌రెడ్డి హత్య కేసును నీరుగార్చేందుకు యత్నం

కొల్లాపూర్: చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి హత్య కేసును పోలీసు యంత్రాంగం నీరుగార్చేందుకు యత్నిస్తుందని ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీధర్ రెడ్డి హత్యకు గురై ఐదు రోజులు అవుతున్నా ఇప్పటివరకు నిందితులను పట్టుకోకపోవడమే ఇందుకు నిదర్శమన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు కనుసన్నల్లో విచారణ సాగుతోందని విమర్శించారు. పారదర్శకంగా దర్యాప్తు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు విష్ణు, కురుమయ్య ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

మానవపాడు: ఎర్రవల్లి మండలంలోని కొండేర్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ భర్త వీరన్నకు కిడ్నీ స్టోన్ ఆపరేషన్ కర్నూల్‌లోని ఆస్పత్రిలో చేయడంతో మంగళవారం ఎమ్మెల్యే విజయుడు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యసిబ్బందికి సూచించారు.

'సురవరం' పాలమూరుకు వరం



వనపర్తిలో సురవరం విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు



వనపర్తి రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో..

వనపర్తి టౌన్: ప్రజాస్వామిక హక్కులు లేని రాచరికంలో, నిర్బంధంలో ధైర్యం కోల్పోకుండా తెలంగాణ ఔన్నత్యాన్ని చాటడానికి నిరంతరం పరితపించిన వ్యక్తి సురవరం ప్రతాపరెడ్డి అని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్ అన్నారు. మంగళవారం సురవరం ప్రతాపరెడ్డి 128వ జయంతిని పురస్కరించుకొని పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సురవరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ, హైదరాబాద్ చారిత్రక వారసత్వాన్ని దశదిశలా చాటిన ప్రతిభాశాలి అని, నిర్బంధాలకు నిరసనగా గళమెత్తిన ఉద్యమకారుడు సురవరం అని గుర్తుచేశారు. ఆంధ్రుల సాంఘీక చరిత్ర రచయితగా సురవరం ఎంతో కృషి చేశారని కొనియాడారు. వనపర్తి ప్రథమ ఎమ్మెల్యేగా సేవలందించిన సురవరం పాలమూరు జిల్లాకు ఓ వరమన్నారు. అదేవిధంగా టీజేఏసీ ఆధ్వర్యంలో స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో, రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో రెడ్డి భవనంలో సురవరం ప్రతాపరెడ్డి జయంతిని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ప్రజా వాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. తెలంగాణ స్ఫూర్తిని రగిలించిన తేజోమూర్తి, గోల్కొండ కవుల సంచిక ముద్రించి, తెలంగాణ కవుల ఆత్మగౌరవాన్ని పతాకస్థాయికి తీసుకెళ్లిన సురవరం ప్రతాపరెడ్డి సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్, నాయకులు చీర్ల సత్యంసాగర్, మధుగౌడ్, నక్క రాములు, నందిమల్ల శ్యాం, కృష్ణబాబు, చంద్రమౌళి, డి. వెంకటేష్, బొంబాయి మన్నెంకొండ, రాజసింహారెడ్డి, రమేష్, రాంబాబు, చుక్క రాజు, డాక్టర్ లతీఫ్, అఖిల్, రఘు యాదవ్, ప్రతాప్‌రెడ్డి, ఆదిత్య, కవులు, టీజేఏసీ ప్రతినిధులు గిరిరాజాచారి, నరసింహాశర్మ, గంధం నాగరాజు, బండలయ్య, నాగన్న యాదవ్, కృష్ణయ్య, సూర్యనారాయణ, రెడ్డి సేవా సమితి ప్రతినిధులు నారాయణరెడ్డి, మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దు



రామన్‌పాడులో రైతులు, ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూర్: రైతులు నకిలీ విత్తనాలను కొనుగోలు చేసుకుని మోసపోవద్దని మండల వ్యవసాయశాఖ సహాయ అధికారి సింధూజ అన్నారు. మంగళవారం మండలంలోని రేచింతల, వీరరాఘవపూర్ గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. అధిక దిగుబడుల కోసం నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వ లైసెన్సు పొంది అర్హత ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా రశీదును పొందాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారులు ప్రతినిత్యం అందుబాటులో ఉంటారని రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు.

అమరచింత: వానాకాలం పంటల సాగు వ్యవహారంలో రైతులు విత్తనాల కొనుగోలు వ్యవహారంలో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి, ఆశించిన దిగుబడి సాధ్యమని ఏఈఓ రాజేష్, మల్లేష్ తెలిపారు. మండలంలోని పాంరెడ్డిపల్లి, నందిమళ్ల, ఈర్లదిన్నె గ్రామాల్లో వ్యవసాయ సాగు విషయాలపై రైతులకు, రైతు కూలీలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనాలను నాటే సమయంలో పంట పొలాలను ఎలా దుక్కిదున్నాలో అన్న విషయాలను రైతులకు వివరించారు.

జీలుగ సాగుతో లాభాలు

మదనాపురం: మండలంలోని రామన్‌పాడులో బుధవారం రైతులకు జీలుగ సాగు పద్ధతులపై ఉపాధి పనులు చేస్తున్న రైతు కూలీల వద్దకు వెళ్లి ఏఈఓ అనిత రైతులకు అవగాహన కల్పించారు. ఈ ఖరీఫ్‌లో లూజు సంచుల్లో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయవద్దని, రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రశీదును పొందాలన్నారు.

ఖిల్లాఘనపురం: రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ సహాయ అధికారి మాధవి అన్నారు. మంగళవారం మండలంలోని అప్పారెడ్డిపల్లిలో రైతులకు విత్తనాల కొనుగోలు, విత్తనాలు నాటే సమయంలో తీసుకోవాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు.. విత్తనాలు, ఎరువులు కేవలం ప్రభుత్వం నుంచి అనుమతులు ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణయ్య, నర్సింహారెడ్డి, శంకర్‌గౌడ్, శ్రీనివాసులు, శేషయ్య, నర్సింహ, లక్ష్మయ్య, మల్లేష్, నరేష్ తదితర రైతులు పాల్గొన్నారు.

విత్తనాల ఎంపిక చాలా ముఖ్యం

పాన్‌గల్: ఖరీఫ్ సీజన్‌లో విత్తనాల ఎంపిక చాలా ముఖ్యమైందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని దావాజిపల్లిలో నిర్వహించిన రైతు సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ విత్తనాల రకాలు, ఎంపిక విధానం, కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు, పంట మార్పిడి, వాడాల్సిన ఎరువుల తదితర అంశాలపై రైతులకు వివరించారు. కేతేపల్లి, బుసిరెడ్డిపల్లి, రేమద్దుల తదితర గ్రామాల్లో నిర్వహించిన రైతు సదుస్సుల్లో ఆయా గ్రామాల ఏఈఓలు పాల్గొని రైతులకు ఖరీఫ్ సాగు విధానం, విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు నరేష్, శైలజ, మహేశ్వరీ, నరేష్, రైతులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జనుంపల్లి, శాఖాపూర్, పాతపల్లి, పెబ్బేరు, రంగాపూర్ గ్రామాల్లో వానాకాలం సీజన్‌కు విత్తనం కొనుగోలుపై ఏఓ చంద్రమౌళి మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు కొనేటప్పుడు రైతులు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు. బిల్లు మీద విత్తనం రకం, లాట్ నెంబరు, విత్తనాల బ్యాచ్ నెంబరు, తయారైన తేదీ, కాలం ముగిసే తేదీలను రైతులు తప్పనిసరిగా చూసి కొనుగోలు చేయాలని వారికి సూచించారు. అదే విధంగా గ్రామస్థాయిలో తక్కువ ధరలకు వచ్చే లూజు విత్తనాలు ఎట్టి పరిస్థితులలో కొనుగోలు చేయరాదని వారికి సూచించారు. వ్యవసాయశాఖ ద్వారా లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద లేదా సహకార సంఘాల వద్ద విత్తనాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ నరేష్, రైతులు బీచుపల్లి, శాంతన్న, బాలస్వామి, ధనుంజయుడు, అల్లెన్న, మనోహర్‌రెడ్డి, వెంకట్రామరెడ్డి ఉన్నారు.



నందిమళ్లలో..



దావాజిపల్లిలో ఏడీఏ చంద్రశేఖర్



రేచింతలలో..



జనుంపల్లిలో..

బీమా చెక్కు అందజేత



పాన్‌గల్: చిక్కేపల్లికి చెందిన జలకంటి శాంతమ్మకు బీఆర్‌ఎస్ పార్టీ నుంచి మంజూరైన రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును మంగళవారం ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన జలకంటి ఆంజనేయులు 4 నెలల క్రితం చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. మృతి చెందిన వ్యక్తికి బీఆర్‌ఎస్ సభ్యత్వం ఉన్నందున పార్టీ నుంచి మంజూరైన ప్రమాద బీమా చెక్కును మృతుడి భార్యకు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. చెక్కు మంజూరుకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డికి, ఎంపీపీకి, గ్రామ బీఆర్‌ఎస్ నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వెంకటయ్యానాయుడు, బాలస్వామియాదవ్, వెంకట్రాములుయాదవ్, నర్సింహ, ఖాదర్, బిచ్చాలు, ధర్మారెడ్డి, రాములు పాల్గొన్నారు.